# చలి

బి. నరసింగరావు

రాత్రి.

వర్షం చినుకులు మొదలయ్యాయి.

రానురాను వర్షం యెక్కువవుతోంది. ఇప్పుడు వర్షం జోరుగా కురుస్తుంది. చినుకులు వాడి బాణాల్లా భూమిమీదికి విసురుతున్నాయ్‌! “జోయ్‌-” మనే చప్పుడు చెవులు గింగుర్లెత్తేలా వినిపిస్తుంది.

మెరుపులు ఉరుములు.

కళ్ళు మిరుమిట్లుగొల్పే మెరుపులు. చెవులు చిల్లులుపడే ఉరుములు.

హైదరాబాద్ మేడల తలుపులు కిటికీలు మూసుకున్నాయ్. ఏ కొద్ది హోటల్లో తెరవబడి వున్నాయ్.

ఆ సమయాన పోచమ్మ రెండు కళ్ళూ తెరుచుకునే ఉన్నాయి. మరో చిన్న ప్రాణి రెండుకళ్ళు మూతబడి లోలోపల కలలు కంటున్నాయి.

నర్సయ్య తన నొదిలి నేటికి నలభై రోజులు.

నర్సయ్య మరొకతిని తీసుకొని తెలియకుండా వెళ్ళిపోయికూడా సరిగ్గా నలభై రోజులే!

పోచమ్మ వీధిన పడింది కూడా నలభై రోజుల క్రితమే!

ఈ నలభై రోజులనుండి ఆ పనీ ఈ పనీ చేసుకుంటూ పొట్ట పోసుకోవడంతో గడిచిపోయింది.

ఈ రోజుతో తనకు ప్రపంచంతో పని తీరిపోయింది.

ఈ వర్షంనుండి-ఈ భయంకర వాతావరణం నుండి బ్రతికి బయటపడ్తే ఏ పల్లెపట్టుకో పోయి తలదాచుకోవాలి.

ఏణ్ణర్ధంకింద నర్సయ్య పోచమ్మను పెళ్ళి చేసుకున్నాడు. ఏడాది తిరిగేలోపుగా మూడ్నెల్ల క్రితం పట్నం తీసుకవచ్చాడు. నెల ఇరవై రోజులు ఆ కూలి ఈ కూలీ చేస్తూ గడిపారు. నలభైరోజులక్రితం ఎవతినో ఎత్తుకొని మాయమయ్యాడు.

ముక్కు మొకం యెరుగని పట్నంలో పోచమ్మ ఒక్కత్తయింది.

చంకలో ఆర్నెల్లు తిరగని బిడ్డ.

దేశంకాని దేశమొచ్చి బజార్న పత్తిని కదా!

ఇదేం వాన: ఇక నా గతేంకాను?

వర్షం జోరు ఇంకా యెక్కువయింది.

పోచమ్మ తడిసి ముద్దయిపోయింది. బిడ్డను యెదకు హత్తుకొని కొంగుతో చుట్టేసింది.

వర్షం గుండుసూదుల్లా గుచ్చుకుంటుంది.

ఏం చేద్దు! బిడ్డ ముదయిపోయింది. ఏ పంచ కిందో తలదాచుకోకపోతే బిడ్డ ఉసూరుమంట ప్రాణం విడుస్తుంది. పైగా మూడు రోజుల్నుంచి ఒళ్ళు వెచ్చబడ్డది. కక్కుకుంటోంది.

పోచమ్మ పరిగెత్తుతూనే వున్నది. పక్కన పెద్ద హోటలు కనపడింది.

పెద్ద పెద్ద లైట్లు వెలుగుతున్నాయ్.

పోచమ్మ కళ్ళు మెరిశాయి. వాన వెలిసే దాక తల దాచుకోవచ్చు.


గబ గబ హోటలు మెట్లు యెక్కింది. పంచకింద ఓ మూలన నిల్చుంది.

ఎవరూ మనుషులున్నట్లు లేదు.

పోచమ్మ గాలి పీల్చుకున్నది.

బిడ్డ గజగజ వణుకుతున్నది. పోచమ్మ





కొంగుతీసి గట్టిగా పిండింది. అంగి కూడా పిండింది. మళ్ళీ కప్పింది. పోచమ్మ పళ్ళు గజ గజ వణుకుతున్నాయ్.

ఇదేమి మాయదారి వాననో! ఇంక రెండు దినాలు ఓపికపడ్తే ఊరికి బోయేదాన్ని! ఇంతలోనే ఏం ముంచుకొచ్చిందో ఏం పాడో. ఇంతటి వాన ఎప్పుడు జూసింది కాదు. నాకే ఇంత చలివేస్తే పసిగుడ్డు బిడ్డకెంత వొణుకుడు పట్టిందో! నా తల్లి! బతుకు బతుకు!

వర్షం మరీ యెక్కువవుతుంది. ఇప్పుడు వీధుల్లో మనుషులు కూడా కనబడడం లేదు. ముందు ఏమున్నదో తెలవడంలేదు.

మాయదారి వాన యెవరి పానాలకు దాపురించిందో: ఏ అయ్యా కట్టించిందో ఈ బంగ్ల. ధర్మాత్ముడు. ఇంత పంచకు తలదాచుకొని బిడ్డను కాపాడుకుంటున్న!

రిక్షాలన్నీ ఆగిపోయాయి! సైకిళ్ళు నడవడంలేదు. మనుషులు అసలు లేరు. పోచమ్మ బిడ్డ కదులుతుంది.

అయ్యో! కడుపు కరకరలాడిందా! పాలు తాగుతదేమో: మూడు దినాలనుండి నాకు కూడే లేకపోయె. నీకు పాలాడికెల్లొస్తయే తల్లీ! అయ్యోరామ ఇదెక్కడి పట్నం! బుక్కెడు బువ్వ దొరకని పట్నం. పసికూనకు పట్టెడు పాలు దొరకని పట్నం.

పోచమ్మ కొంగుదీని రవికదీసి చన్ను బిడ్డ నోట్లో పెట్టింది. వొణుకుతూనే బిడ్డ చన్ను చీకుతోంది.

దాంట్లో ఏమున్నయే తల్లీ! పాలా మన్నా! చీకు చీకు. చీకన్నా జేరంత ఇద్దైతవు. నా కడుపుల మెతుకు లేదు. నీ నోటికి పాలేడ అందుతయి బిడ్డా. నా బిడ్డ. నా తల్లి. యెల్లమ్మ పేరు పెట్టుకుంటిని గదనే. తల్లికేమన్నా పాపం జేస్తినా! తల్లీ! బతికి బట్టగడ్తె ముడుపుజెల్లిస్త!

ఎంతకూ పాలురాక బిడ్డ మెసులుతోంది. చలికి వొణుకుతోంది.

చీకమ్మా! చీకుబిడ్డా! పాలు లెవ్వు.

బిడ్డ తలను యెదకేసి అదుముకున్నది.

ఇంతలో—

ఒక లావాటి ఎర్రగా బుర్రగా వున్న మనిషి వచ్చాడు.

కౌన్ హై-గరీబ్-హట్ జావ్-బాహర్ జావ్ హూ....

చెలో—

ఏమో అంటున్నాడు. తనకి తెలియని భాషలో, అర్థంకావడంలేదు.

చల్ బాహర్-సునే నహీ, ఆరా....!కౌన్ హై అందర్. ఇదరావ్—లోపల్నించి ఎవరో వచ్చారు.

పో: పో: అవుతలికి పో!

పొమ్మంటుంటే: నిన్నేనే! చెప్తుంటే మనిషివా గాడ్దివా?

నీ తాత జాగీరనుకున్నావా! పో! నడువు!

పోచమ్మ ఇక చేసేదిలేక మెట్లు దిగింది. బిడ్డను యెదకు అదుముకొని వెనక్కు తిరిగి చూసింది. మెట్లదగ్గర వాడు యముడిలా నిలబడ్డాడు. పోచమ్మ వర్షంలోకి నడిచింది.

వర్షం ఏమాత్రం తగ్గలేదు.

ఉరుములు మెరుపులు ఇంకా యెక్కువైనాయి.

కళ్ళు జిగేల్‌మని మెరుస్తున్నాయ్ మెరుపులకు.

గుండె గజ గజలాడుతుంది ఉరుములకు.

తోవ కనబడదు. ముందర అంతా నల్లగా యేమున్నదో కనబడదు. దూరంగా అక్కడక్కడా తెల్లగా మబ్బుల్లాగా కనబడుతున్నయ్ దుకాణాలు. కట్టెతో పొడిచినట్టు వాన శరీరాన్ని బాదుతోంది. పిల్ల యేడుస్తోంది.

పోచమ్మ పరిగెత్తుతోంది. నీళ్ళు మడమలు దాటిపోయాయి.

పోచమ్మ కాలు తీసి కాలు వేస్తున్నది.

అతి కష్టంగా కొంతదూరం నడిచింది.

బిడ్డ గుక్క తిప్పుకోకుండా ఏడుస్తోంది.

పోచమ్మ తనకున్న శక్తినంతా కూడగట్టుకొని కాస్త యెత్తయిన స్థలానికి వచ్చింది. ఇప్పుడు నడవడానికి కాళ్ళు ఇబ్బంది పెట్టడం లేదు. ఒక చిన్న చెట్టు కనబడింది. ఆశతో అటువైపు పరిగెత్తింది.

సర్రున ఒక పొడవాటి కారు ఒకటి దూసుకొని వచ్చింది. హెడ్‌లైట్ల కాంతితో—

వచ్చి సరాసరి ఆ చెట్టుకింద ఆగింది.

ఆ చెట్టుకింద ఆగగానే, చిప్పున చిమ్మిన వర్షపు నీరు కారు టైర్లకిందనుండి పోచమ్మపై చిమ్మింది. పోచమ్మ ఒక చేత్తో ముఖం తుడుచుకుంది.

పోచమ్మ బిడ్డను గుండెలకు అదుముకుంది. చెట్టుకింద నిలబడ్డా వర్షం పైన పడుతూనే వుంది. బిడ్డ వొణుకుడు మరీ యెక్కువయింది.

పళ్ళు గజ గజ వణుకుతున్నాయ్! కాళ్ళు గజ గజ వణుకుతున్నాయ్! శరీరం మొత్తం గజ గజ వణుకుతున్నది. పోచమ్మ బిడ్డను ఇంకా గట్టిగా కౌగిలించుకున్నది.

చలి. చలి. చలి. యెముకలు కొరికే చలి.

పోచమ్మ ఆకాశంకేసి చూసింది. ఏమీ కనబడలేదు.

అంతా యెగపోతగా వాన:

కారులో లైటు వెలిగింది. లోపల చలిలో ఏవో ఆకారాలు కదులుతున్నాయ్.

అన్నీ అద్దాలు బిగించి వున్నాయ్.

పోచమ్మ!

బిడ్డ! ఇదేం చలీ! అయ్యో....

చలికి ఇద్దరు గడ్డకట్టుకు పోతున్నారు. పోచమ్మ పోచమ్మ బిడ్డ. కాళ్ళు కొంకర్లు పోతున్నాయ్. కళ్ళు బైర్లుకమ్మాయి. తల తిరుగుతోంది. బిడ్డ ఏమయిందో! ఏమీ కనబడదు! చలి చంపివేసే చలి! చెట్టుకింద చలికి ఇద్దరూ గిల గిల లాడుతున్నారు. కారులో చలికి ఆ యిద్దరూ వెచ్చదనం రాజేసుకుంటున్నారు. ఏమి చలి ఇది! ద్వంద్వార్థాల చలి! □

## బానిసలు

ఈ రోజు
నాలో చెలరేగుతున్న భాష
కలానికి బానిస—
నన్ను ముట్టడిస్తున్న ఆలోచనలు
మెదడుకు బానిసలు—
చైతన్యంతో తిరిగే యంత్రం
చేతికి బానిస—
శత్రువుపై ఎక్కుపెట్టిన తుపాకి
ట్రిగ్గర్‌కు బానిస—
వెన్నెల ప్రసాదించే చంద్రుడు
సూర్యుడికి బానిస—
కాని, రేపు
మొత్తం సమాజమే
కష్టజీవులకు బానిస.

—శైలకుమార్